ప్రజాశక్తి
శనివారం 12 జులై 2025 5 అనంతపురం





యర్రగుంట్ల గ్రామం వద్ద హెచ్ఎల్సి కాలువను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, విప్ కాలవ

ప్రశ్నార్థకంగా బిటిపి మనుగడ..!

◆ కర్నాటకలో బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం.?
◆ ఈ నిర్మాణం జరిగితే బిటిపికి నీరు రావడమే గగనమే
◆ ప్రాజెక్టు ఎగువన వేదవతి నది పరివాహక ప్రాంతం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో 12 వేల ఎకరాలకు సాగునీరు అందించే భైరవానితప్ప ప్రాజెక్టు(బిటిపి) రిజర్వాయర్‌కు మరో ముప్పు ఎదురు కానుంది. కర్నాటక రాష్ట్రం చెల్లకెరే తాలూకా రాష్ట్ర సరిహద్దు గుడిపల్లి (గుడిహళ్లి) తప్పగోండనహళ్లి గ్రామాల నడుమ వేదవతి నదిపై రోడ్ కం బ్యారేజ్ నిర్మాణానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చెల్లకెర ఎమ్మెల్యే గురుమూర్తి విజ్ఞప్తి మేరకు బ్యారేజ్ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం రూ.31.40 కోట్లు మంజూరు చేసింది. ఈ నిర్మాణం జరిగితే భైరవానితిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్‌కు వేదవతి నది నీరు రావడం ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ఇదే జరిగితే బిటిపి మనుగడే ప్రశ్నార్థం అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే అరకొర నీరు వస్తున్న నేపథ్యంలో మళ్లీ ప్రాజెక్టు పైన మరో నిర్మాణం జరిగితే వచ్చే నీళ్లు కూడా రాని పరిస్థితి నెలకొంటుంది.

ఆరున్నర దశాబ్దాల క్రితం వేదవతి నదిపై ఆంధ్ర రాష్ట్ర సరిహద్దున రెండు టిఎంసిల సామర్థ్యంతో భైరవాతిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్‌ను నిర్మించారు. రిజర్వాయర్ నిర్మించాక నిబంధనల మేరకు ఈ ప్రాజెక్టు ఎగువన వేదవతి నదిపై ఎలాంటి ఆనకట్టలు, రిజర్వాయర్లు నిర్మించరాదు. ఇందుకు విరుద్ధంగా ఈ మధ్యకాలంలో వేదవతి నదిపై కర్ణాటక రాష్ట్రంలో మూడు చోట్ల ఆనకట్టలు, బ్యారేజీలు నిర్మించారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు. దీంతో బిటి ప్రాజెక్టు రిజర్వాయర్‌కు నీటి రాక గగనమైంది. గతంలో ఏడాదికి రెండు పంటలకు 12వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లభించేది. కర్ణాటకలో అక్రమ ఆనకట్టలు, కట్టడాలు నిర్మించాక మూడు, నాలుగు ఏళ్లకు ఓసారి కానీ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సాగునీరు అందలేదు. రిజర్వాయర్‌కు జీడిపల్లి నుంచి ఎత్తిపోతల పథకం కింద సాగునీటిని అందించాలని పదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వం మూడుసార్లు భూమి పూజలు, శంకుస్థాపనలు చేసింది. అయినా ఇప్పటివరకు కాలువలు తవ్వడం, నీటిని మళ్లించడం పనులు జరగలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో టిడిపి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అధికారం చేపట్టిన ఏడాది కాలంలో రెండు సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో బిటిపికి ఎలాంటి



బిటి.ప్రాజెక్ట్

కేటాయింపులూ చేయలేదు. గతంలో రూ.968 కోట్ల అంచనాతో తయారుచేసిన ఎత్తిపోతల పథకానికి ఏడాదికి కనీసం రూ.250 కోట్లతో మంజూరు చేసినా పూర్తి చేసేందుకు నాలుగేళ్లు పడుతుంది. ఇప్పటివరకు ఈ ఎత్తిపోతల పథకానికి అవసరమైన నిధులు మంజూరు చేయలేదు. ఇటీవలే పనులు చేపట్టేందుకు భూమిపూజ చేశారు. నిధుల కేటాయింపు, మంజూరు లేకుండా పనులు ఎలా జరుగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానంగా తలపెట్టిన బ్యారేజ్ కం బ్రిడ్జిని అడ్డుకోకపోతే బీటీ ప్రాజెక్టు రిజర్వాయర్‌కు వచ్చే కొద్దిపాటి నీరు కూడా రాకుండా పోయే ప్రమాదం ఉంది. పాలకులు, అధికారులు ఈ అక్రమ కట్టడం నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

◆ ఏడాదిలో సంక్షేమం రెట్టింపు
◆ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-కణేకల్లు

వైసిపి పాలన అనంతరం అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్నారని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులతో కలిసి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా యర్రగుంట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల ఇళ్ల వద్దకెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రానికి ఎదురుకానన్ని ఆర్థిక సమస్యలను మన రాష్ట్రాల్లో వైసిపి పాలకులు సష్టించారని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవంతో గడిచిన ఏడాది కాలంలో రాష్ట్రం ప్రగతి బాట పట్టిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా, ప్రజా సంక్షేమం కోసం బాధ్యతగా పని చేస్తున్నామన్నారు. సంక్షేమం డబుల్ చేస్తూనే అభివృద్ధి పదింతలు చేస్తామన్నారు. విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. మంత్రి పయ్యావుల సహకారంతో మరిన్ని నిధులు నియోజకవర్గానికి వస్తాయన్నారు.

హెచ్‌ఎల్‌సి, యుటి పనుల పరిశీలన

మండల పరిధిలోని యర్రగుంట్ల సమీపంలో హెచ్ఎల్‌సి కాలువపై జరుగుతున్న అండర్ టర్నల్ పనులను మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. కాలువకు త్వరలో నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో పనుల పురోగతిని పరిశీలించారు. ఈనెల 15 నుంచి హెచ్ఎల్‌సి, హంద్రీనీవా కాలువలకు నీటి సరఫరా మొదలవుతుందని మంత్రి కేశవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వన్నారెడ్డి, మండల కన్వీనర్లు లాలేప్ప, బలరామి రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, గంగాధర్, బసవరాజు సుదర్శన్, ఆది, ఆనంద రాజు, చంద్రశేఖర్ గుప్తా, రమేష్, ముజామిల్, మారుతి, చాంద్ బాషా, డిఎంహెచ్ఒ ఈబి.దేవి హెచ్ఎల్‌సి డీఈ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఐద్వా రాష్ట్ర మహాసభల సన్నాహక సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభలు 2025 అక్టోబర్ నెలలో అనంతపురంలో జరగనున్నాయి. రాష్ట్ర సభల నిర్వహణకు ఆహ్వాన సంఘం సమావేశాన్ని నేడు(శనివారం) ఉదయం 10-30 గంటలకు అనంతపురం ఎన్జీవో హోంలో నిర్వహిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి హాజరవుతారన్నారు. కవులు, మేధావులు హాజరై రాష్ట్ర మహాసభల నిర్వహణలో భాగస్వాములై సలహాలు, సూచనలు ఇవ్వాలని వారు కోరారు.

పి-4కు మార్గదర్శుల గుర్తింపు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పి4 కార్యక్రమం కింద మార్గదర్శులను గుర్తించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. జీరో పావర్టీ పి4పై జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జీరో పావర్టీ పి4 కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా 68,316 మంది బంగారు కుటుంబాల గుర్తింపు జరిగిందన్నారు. వారి భవితకు భరోసా కల్పించేందుకు దాతలను (మార్గదర్శకులను) గుర్తించాలన్నారు. ఇప్పటివరకు 20 మంది మార్గదర్శకులు లాగిన్ అయి రిజిస్ట్రేషన్ అయ్యారని, వారు 813 మందిని దత్తత తీసుకున్నారని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నాటికి అర్హత కలిగిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. జిల్లా అధికారులందరూ ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, అర్ధశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలత మాట్లాడుతూ యువత నాణ్యమైన మానవ వనరులుగా తయారవ్వాలని తెలిపారు. అర్థశాస్త్రం అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కె.శ్రీధర్ మాట్లాడుతూ మానవ హక్కులు, ముఖ్యంగా పునరుత్పత్తి హక్కులు, ఎంపికల గురించి మాట్లాడటానికి ప్రపంచ జనాభా దినోత్సవం ఒక వేదికగా మారిందన్నారు. కార్యక్రమంలో ఐక్యు ఎసి కోఆర్డినేటర్ ప్రభావతి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు శ్యామ్‌ప్రసాద్, అధ్యాపకులు షౌకత్‌అలీ, జ్యోష్ణ, కవిత, శశికిరణ్, చాముండేశ్వరమ్మ, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని మంత్రికి వినతి

రాయదుర్గం : ఈ మార్గం గుండా వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను రాయదుర్గం రైల్వే స్టేషన్‌లో ఆపాలని స్థానికులు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నకు విజ్ఞప్తి చేశారు. మంత్రి సోమన్న శుక్రవారం సాయంత్రం రాయదుర్గం మీదుగా హాస్పేటకు ప్రత్యేక రైలులో వెళుతుండగా స్టేషన్‌లో కొద్దిసేపు రైలు ఆగినప్పుడు స్థానిక రైల్వే యాక్షన్ కమిటీ నాయకులు జయంతి సురేష్, అంబాజీరావు, తదితరులు మంత్రిని కలిశారు. రాయదుర్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని రాయదుర్గం-తుమకూరు రైలు మార్గం, పట్టణంలోని కణేకల్లు రోడ్డు, అనంతపురం రోడ్డులో అసంపూర్తిగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఆయా పనులు సకాలంలో పూర్తవుతాయని మంత్రి హామీ ఇచ్చారు.

డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఛార్జ్ మెమో

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కుందుర్పి

సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ లక్ష్మీశంకర్ హెచ్చరించారు. గత గురువారం మండలంలోని ఎన్.వెంకటంపల్లి గ్రామ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి సచివాలయ ఉద్యోగుల గైర్హాజరు కావడంపై శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపిడిఒ ఉదయం ఎన్.వెంకటంపల్లి గ్రామం వెళ్లి ఆ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి గైర్హాజరైన డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు ఛార్జ్‌మెమో జారీ చేశామని తెలిపారు. వారిద్దరిపై ఉన్నత స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎంపిడిఒ స్పష్టం చేశారు.

బీమా గడువు 30 వరకు పొడిగించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా వాతావకరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం గడువును జులై 30వ తేదీ వరకు పొడగించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటల బీమా నమోదు చేసుకోమని అధికారులు చెబుతున్నా రైతులు ఎక్కడ చెల్లించాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి ప్రీమియం చెల్లింపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన బీమా ప్రీమియం వేరుశనగ ఎకరాకు రూ.640. పత్తి ఎకరాకు రూ.1900, చీనీకు రూ.2750, టమోటాకు రూ.1600 చెల్లించాల్సి ఉందన్నారు. ఇంత మొత్తం ప్రీమియం చెల్లించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రీమియం రద్దు చేసి, ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు.

'తెలుగుతమ్ముళ్ల' బాహాబాహీ

◆ శింగనమల మండల కన్వీనర్ ఎంపికపై వాగ్వాదం ◆ భైరసముద్రంలో 'ఉపాధి' విచారణలో ఘర్షణ

అధికార తెలుగుదేశం పార్టీలో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. శుక్రవారం నాడు శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. శింగనమల మండల కన్వీనర్ ఎంపికపై జరిగిన కార్యక్రమంలో నాయకులు బాహాబాహికి దిగారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలంలోని భైరసముద్రంలో ఉపాధి హామీలో జరిగిన అవినీతిపై అధికారులు తనిఖీలకు వెళ్లిన సందర్భంగా గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో అధికారులు తనిఖీని మధ్యలో ఆపేసి వెళ్లిపోయారు.



శింగనమలలో బాహాబాహికి దిగిన తమ్ముళ్లు



భైరసముద్రంలో వాగ్వాదం చేసుకుంటున్న టిడిపి మద్దతుదారులు

శింగనమల మండల కన్వీనర్ ఎంపికలో బాహాబాహి

శింగనమల : మండల తెలుగుతమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఎంపికలో రెండు వర్గాల వారు వాగ్వివాదానికి దిగి పిడుగుద్దులు గుద్దుకునే వరకూ వెళ్లారు. అయితే సకాలంలో పోలీసులు స్పందించడంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళ్తే... శుక్రవారం మండల కేంద్రంలోని దుర్గాంజనేయ స్వామి కొండపై మండల కన్వీనర్ ఎంపికపై నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ వేలూరు రంగయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా కన్వీనర్ పోటీలో ఉన్న 20 మంది పేర్లను చదివి వినిపించారు. ప్రస్తుతం అందరి పేర్లను అధిష్టానానికి పంపుతామని, అధిష్టానం ఎవరిని నిర్ణయిస్తే వారే కన్వీనర్ అవుతారని వేలూరు రంగయ్య ప్రకటించారు. దీంతో సమావేశం ముగిసి అందరూ బయటకు వెళ్తుండగా కన్వీనర్ జాబితాలో ఇద్దరికి చెందిన వర్గాలవారు వాగ్వివాదానికి దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమావేశం ముగియగానే ఒ వర్గం వారు వచ్చి కేకలు వేస్తూ జాబితాలో వ్యక్తిని ఎగురవేస్తూ సంబరాలు చేసుకున్నారు. అదే సమయంలో మరో వర్గం వారు బయటకు వస్తుండగా ఒకరికొకరు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాల వారు కలిసి పిడిగుద్దులు గుదుకున్నారు. విషయం తెలుసుకున్న సిఐ కౌలుట్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాల వారికి సర్దిచెప్పి పంపారు.

భైరసముద్రంలో 'ఉపాధి' విచారణలో ఘర్షణ

కళ్యాణదుర్గం టౌన్ : జాతీయ ఉపాధి హామీ చట్టం తెలుగు తమ్ముళ్లకు దోచుకునే పథకంగా మారిపోయింది. బ్రహ్మసముద్రం మండలంలో ఉపాధి హామీలో ఏడాదిగా వెలుగు చుస్తున్న అక్రమాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. బ్రహ్మసముద్రం మండలంలోని భైరసముద్రంలో ఉపాధి హామీలో జరిగిన అవినీతిపై ఆ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పెన్నప్ప గత సోమవారం అనంతపురంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ డ్వామా పీడీ సలీమ్ బాషాను సమగ్ర విచారణకు ఆదేశించగా శుక్రవారం భైరసముద్రం గ్రామంలో జరిగిన అవినీతిపై పీడీ క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లారు. ఫారం పాండ్స్ పనులను కూలీలతో చేయించకుండా జెసిబిలతో చేయించారని, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్ ఆయనకు కావాల్సిన వారి పేరుతో జనరేట్ చేశారని అందిన ఫిర్యాదు ఆధారంగా పీడీ విచారణ చేపట్టారు. రైతు తిప్పేస్వామి పొలంలో వర్క్ ఐడి నెంబర్-10286 పేరుతో చేసిన ఫారం పాండ్స్ పనులను పరిశీలిస్తుండగా ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్, టిడిపి కార్యకర్త లక్ష్మన్నతో పాటు మరి కొందరు తామంతా రైతులమని కూలీ పనులు చేశామని ఎక్కడా అవినీతి జరగలేదని వాదనకు దిగారు. పెన్నప్ప, మరికొందరు టిడిపి నాయకులు అన్ని పనులు జెసిబితో చేశారని తెలిపారు. దీంతో టిడిపికి చెందిన రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకానొక దశలో బాహాబాహీకి దిగారు. నాలుగు ఫారం పాండ్స్ పనుల్లో పనులు చేయని వారి పేరుతో బిల్లులు మంజూరు చేసి పనులు చేసే వారికి అన్యాయం చేస్తున్నారని పెన్నప్ప మద్దతుదారులు వాపోయారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం తీవ్ర రూపం దాల్చడంతో సుమారు 45 నిమిషాల పాటు అక్కడే వున్న పీడీ విసుగుచెంది ఇలా అయితే విచారణ ఎలా సాధ్యమని, ఇది మంచిదికాదని, పూర్తి స్థాయిలో మరోసారి విచారణ చేపడతానని స్పష్టం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై డ్వామా పీడీ సలీమ్‌బాషాను వివరణ కోరగా ఫిర్యాదు ఆధారంగా విచారణకు వెళ్లామని అక్కడ ఒకరికొకరు వాదించుకోవడంతో గందరగోళం చోటు చేసుకోగా పూర్తి స్థాయిలో మరోసారి విచారణ చేస్తామని చెప్పినట్లు తెలిపారు.

శివాలయంపై కలశం చోరీ.!

పోలీసులకు అందని ఫిర్యాదు

ప్రజాశక్తి-డి.హీరేహాల్



ఈశ్వర ఆలయం పై దోపిడీకి గురైన కలశం

మండలంలోని పురాతన శివాలయంలో కలశం చోరీకి గురైంది. మండలంలోని కూడ్లూరు గ్రామస్తులు తెలిపిన వివరాలు.. చోళ రాజుల కాలం నాటి ఈ శివాలయం గోపురంపై ఏర్పాటుచేసిన కలశం చాలా విలువైందని ప్రచారంలో ఉందన్నారు. గత బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిచ్చెన ద్వారా ఆలయం ఎక్కి కలశాన్ని పెకలించి ఎత్తుకెళ్లారన్నారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల సహాయ, సహకారాలతోనే దుండగులకు అర్ధరాత్రి వేళ ఈ చోరీకి పాల్పడినట్టు గ్రామంలో ప్రచారం ఉంది. గతేడాది కూడా ఆ ముగ్గురు వ్యక్తులు శివాలయంపై ఉన్న కలశాన్ని తమకు ఇస్తే గ్రామంలోని ఆలయాలు, గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని చెప్పారని, అయితే గ్రామస్తులు వారి ప్రతిపాదనను అంగీకరించకపోవడంతో అప్పట్లో వారి ప్రయత్నాలను విరమించుకున్నారని గ్రామ స్తులు చర్చించుకుంటున్నారు. కలశం చోరీ విషయమై రాయదుర్గం రూరల్ సిఐ వెంకటరమణ మాట్లా డుతూ విషయం తెలిసిన వెంటనే ఆలయాన్ని సందర్శించామని, గ్రామంలో విచారణ చేపట్టామని తెలిపారు. గ్రామస్తులు ఫిర్యాదు చేయకపోయినా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది ఇప్పటికే రెండు పర్యాయాలు గ్రామంలో విచారణ చేపట్టామని, దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసుల దర్యాప్తునకు దోహదపడుతుందని సిఐ తెలిపారు.

వేతనాలందకపోతే ఎలా బతకాలి..?

ప్రజాశక్తి-కుందుర్పి

నాలుగు నెలలుగా వేతనాలు అందకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని పారిశుధ్య కార్మికులు అధికారులను నిలదీసిన సంఘటన శుక్రవారం మండలంలోని అప్పిలేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈవోఆర్డీ బాలాజీ, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు శుక్రవారం అప్పిలేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 55 మంది కార్మికులు ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. అరకొర వేతనాలు కూడా నాలుగు నెలలుగా ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే వేతనాలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈవోఆర్‌డీ మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించలేని మాట వాస్తవమే.. ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి అతి తొందరలో వేతనాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. వారి వెంట సర్పంచి హసీనాబీ అతావుల్లా ఉన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంపిడిఒ విజయభాస్కర్ తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మురికినీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

కుందుర్పి : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ లక్ష్మీశంకర్ అధ్యక్షతన గ్రామపంచాయతీ పురోగతి సూచిక కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పురోగతి సూచిక నమోదు చేసిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన సమాచారాన్ని అందించాలని సూచించారు.

బ్రహ్మసముద్రం : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రంగనాయకులు ఆధ్వర్యంలో 'పంచాయతీ పురోగతి సూచిక 2.0' ఆర్థిక సంవత్సరం 2023-24 ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ యోగేష్, అసిస్టెంట్ ట్రైనర్ ఆంజనేయులు శిక్షణ ఇచ్చారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తా

'సుపరిపాలనలో తొలిఅడుగు'లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కొత్తూరు గ్రామస్తులు

నియోజక వర్గంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు హామీ ఇచ్చారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే మండల టిడిపి నాయకులతో కలిసి మండలంలోని కొత్తూరు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి 'సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. స్థానిక సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసు కున్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ రూరల్ మండలంలోని పాపంపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి దారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అధికారంలో ఉన్న ఐదేళ్లు నిద్రపోయావా.?

రంగయ్యపై ఎమ్మెల్యే ఆగ్రహం

కళ్యాణదుర్గం టౌన్ : అధికారంలో ఉన్న ఐదేళ్లు నిద్రపోయావా.. వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించబోమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాజీ ఎంపి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త రంగయ్యను హెచ్చరించారు. ఇటీవల రంగయ్య ఎమ్మెల్యే, ఆయన సంస్థపై చేస్తున్న వ్యంగ్రాస్త్రాలపై ఎమ్మెల్యే శుక్రవారం మండలంలోని మోరేపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో ఘాటుగా స్పందించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు అక్కడి సమస్యలు తెలుసుకోలేక నిద్రపోయావంటూ ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తామని కలలు కనాల్సిందేనని, వైసిపి ఎప్పటికీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. నా గురించి, నా సంస్థ గురించి వ్యక్తిగతంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. నాపై, నా సంస్థపై మాట్లాడే హక్కు ఎవరికీ లేదన్నారు. యాటకల్లు వద్ద క్రషర్ ఏర్పాటు విషయంలో అనవసరమైన విమర్శలు చేస్తున్నారని, ఆ కొండ వద్ద ఎలాంటి దేవుని ఆనవాళ్లు లేవని, వేరే కొండ వద్ద దేవుని ఆనవాళ్లు వున్నాయని మాకు దేవుళ్లంటే భక్తి ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బిటిపి, ఈ ప్రాంతంలో జరిగే నేషనల్ హైవే పనులకు అవసరం మేరకు అన్ని అనుమతులతో క్రషర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. లిక్కర్ విషయంలో పక్క నియోజకవర్గాల్లో ఎలాంటి లాభనష్టాలు ఉన్నాయో తెలుసుకోండని, మీ ప్రభుత్వ హయంలో మాదిరి నాశిరకం, మద్యం, దొంగ మద్యం వ్యాపారాలు చేయలేదని, మా ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం విక్రయిస్తున్నామన్నారు. అసత్యమైన ఆరోపణలు చేస్తే మీ ఇంటికొచ్చి కూర్చుని మిమల్ని నిదీసే దమ్ము నాకుందన్నారు. మా పాలన పట్ల ఆకర్షితులై గ్రామాల్లో వైసిపి సర్పంచులు, కార్యకర్తలు టిడిపి వైపు చూస్తున్నారన్నారు.

కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఈనెల 12వతేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్న నేపథ్యంలో పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నగర గౌరవాధ్యక్షులు గోపాల్ అధ్యక్షతన శిబిరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, వైఎస్ఆర్‌టియు జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, మెడికల్ రెప్రజెంటేటివ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి లతీఫ్, ఆటో యూనియన్ నగర కార్యదర్శి ఎస్‌కెఆర్ శ్రీనివాసులు, ఆవాజ్ నగర అధ్యక్షులు ఇర్షాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కార్మికులు అనేక రోజులుగా మీరు పోరాటం చేస్తున్నా చర్చల పేరుతో కాలయాపన చేయడం బాధాకరమన్నారు. మీ పోరాటానికి ప్రజలు, ప్రజాసంఘాల మద్దతు కూడగట్టుకుని మరింత ఉధృతంగా పోరాడాలని.. మీ పోరాటానికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. 12వతేదీ అర్ధరాత్రి నుంచి ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా మంచినీరు, వీధిదీపాలు అనేక రకాల సేవలు నిలిచిపోతాయన్నారు. ఇందుకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎజిఎం నాగరాజు, పారిశుధ్య కార్మిక సంఘం నగర కార్యదర్శి తిరుమలేశ, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, శివన్న, రవికిరణ్, రవి, గౌస్, రాజేంద్ర, లక్ష్మీ, సుధారాణి, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

తాడిపత్రిలో బైక్ ర్యాలీ

తాడిపత్రి : ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు తాడిపత్రిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు కొనసాగి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు జుబేర్, శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13వేల మందికిపైగా ఇంజినీరింగ్ కార్మికులు గత ప్రభుత్వ హయాంలో జరిగిన 17 రోజుల సమ్మెలో మోసపోయారన్నారు. ఇప్పటి వరకు కొత్త ప్రభుత్వం ఆ యా సమస్యలపై ఎలాంటి స్పందన చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వతేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రామాంజనేయులు, ఉమాగౌడ్, హనుమంతురెడ్డి, ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు జుబేర్, కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, కార్మికులు పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలతో మహిళ మృతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మృతిచెందిన షేక్‌చాందిని

డెంగీ లక్షణాలతో మహిళ మృతిచెందిన ఘటన అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ చాందినిని ఒకటిన్నర సంవత్సరం క్రితం గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన షేక్ సాదిక్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి రెండు నెలల పాప ఉంది. అయితే ఈనెల 6న ఆమెకు జ్వరం రావడంతో పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించారు. డెంగీ లక్షణాలు కనిపించడంతో అనంతపురంలోని సవేరా ఆసుపత్రికి చేర్పించారు. అక్కడ రెండు రోజులపాటు చికిత్స తీసుకుంది. అప్పటికే జ్వరం తగ్గకపోగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమెకు భర్త, రెండు నెలల కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త సాదిక్ కూలి పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. భార్య మరణంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఎస్‌కెయు పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ బడ్జెట్‌తోపాటు, కోర్టు ఆర్డర్ ప్రకారం 21 పోస్టుకు సంబంధించిన, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ అంశంతోపాటు వివిధ అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి బి.అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్టర్ రమేష్‌బాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ మధు మూర్తి, ఫైనాన్స్ సెక్రటరీ, ఉన్నత విద్యా కార్యదర్శి పాల్గొన్నారు.



పొగాకు నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, విద్యార్థులు

పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

అనంతపురం : పొగాకు వ్యతిరేకంగా ఈనెల 21వతేదీ వరకూ ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించి సంతకాల సేకరణ చేపట్టాలని జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమ సోషల్ వర్కర్ బోయ శ్రీరాములు సూచించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఇబి దేవి ఆధ్వర్యంలో అనంతపురంలోని పంతులు కాలనీలో ఉన్న ఉన్నత పాఠశాలలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగరెట్టు, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే క్యాన్సర్ వంటి భయానక వ్యాధులు రాకుండా నివారించుకోవాలన్నారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కరుణ్, రఫీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయదారులకు జరిమానా

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణాదారులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని దుకాణాలు, వ్యాపార సంస్థల్లో మున్సిపల్ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో 10 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారులకు రూ.5100 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి : ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవం గుత్తిలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపో వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ వర్కింగ్ అధ్యక్షులు ఎంఆర్ ఆంజనేయులు, నాయకులు ఎన్ఎస్ నాయక్, డి.హసన్‌సాహెబ్, వి.గంగేశ్వర్, పికె రాముడు, ఎస్ఎస్ వాసులు, టి.ప్రసాద్, ఎం.రంగన్న, బి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మెన్ల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి : జూనియర్ లైన్‌మెన్ (గ్రేడ్-2)ల సమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, గుత్తి డివిజన్ అధ్యక్షుడు శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభ పిళ్లైకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగుల మధ్య సర్వీస్ రూల్స్ అమలు చేయటం చట్ట విరుద్ధమన్నారు. నూతన సర్వీస్ రూల్స్ ను రద్దుచేసి పాత సర్వీస్ రూల్స్ ప్రకారం ఎఎల్ఎం ప్రమోషన్లతో పాటు హక్కులను కల్పించాలన్నారు. విద్యుత్ రంగంలో కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలను తక్షణమే నిర్వహించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థి సంఘాల జెసి నియోజకవర్గ అధ్యక్షులుగా పురుషోత్తం

ఉరవకొండ : విద్యార్థి సంఘాల నియోజకవర్గ జెఎసి అధ్యక్షులుగా సాకే పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జెఎసి సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉరవకొండలోని ఆర్అండ్‌బి బంగ్లా నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షులుగా భీమేష్, పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా హిరణ్య, కార్యదర్శిగా జి.భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమార్‌స్వామి, కోశాధికారిగా ముండ్ల రాము, అధికార ప్రతినిధిగా గణేష్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా మనవుల నగేష్, కార్యవర్గ సభ్యులుగా ఎరుకుల మహేంద్ర, ఎం.ధనంజయ, రామాంజనేయులు, చెన్నకేశవులు, ప్రిన్స్, సలహాదారులుగా మీనుగ మధుప్రసాద్, సాకే రమేష్, నల్లబోతుల రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు.



భగత్‌సింగ్ ఆటో యూనియన్‌లో చేరిన కార్మికులు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

కూటమి నాయకులు ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో గుత్తిపాళ్యం గ్రామానికి చెందిన 45 మంది ఆటో కార్మికులు సిఐటియు అనుబంధ భగత్‌సింగ్ ఆటో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం సిఐటియు కట్టుబడి పని చేస్తోందన్నారు. ఆటో కార్మికులపై పోలీసులు, ఆర్టీవో అధికారి వేధింపులు ఆపాలన్నారు. ప్రయాణికులు పట్ల గౌరవంగా ప్రవర్తించాలన్నారు. లైసెన్స్ ఉన్న ప్రతి కార్మికుడికీ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కట్టాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా మల్లికార్జున, కార్యదర్శిగా శర్వానంద్, అధ్యక్షునిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా టి.శ్రీనివాసులు యాదవ్, కోశాధికారిగా జె.శ్రీనివాసులుతో పాటు మిగిలిన 30 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌కెఎం బాషా, లోకు, జాకీర్, వెంకీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజలపై భారాలు వేసే విద్యుత్ సెకీ ఒప్పందాలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక హంపిరెడ్డి భవనంలో క్యూ ఆర్ కోడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల వ్యతిరేకతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై అధిక విద్యుత్ ఛార్జీల భారాలు మోపే విధంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను క్యూ ఆర్ కోడ్ ద్వారా ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లేందుకు క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రజలకు పంపిణీ చేసి ప్రజలు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలనే అమలు చేయడం బాధాకమరన్నారు. వెంటనే సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యవర్గ సభ్యులు జగ్గలి రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు షాషా, రామునాయక్, జాకీర్, జ్యోతి, ఉలిగప్ప, తిమ్మప్ప, బాషా, వెంకీ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న సిపిఎం నాయకులు

హామీల అమలుకు సర్కారు మెడలు వంచుదాం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడలు వంచైనా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేలా చర్యలు తీసుకుందామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురంలోని యాపిల్ గార్డెన్స్‌లో వైసిపి అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో చంద్రబాబు అవకాశవాది అన్నారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు ముఖ్యమంత్రి కాగా ప్రతిసారి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. జగన్ సీఎం అయ్యాక నవరత్నాలు పథకాలు తీసుకొచ్చి దిగ్విజయంగా అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఏడాది గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పని చేస్తామన్నారు. ఓడిపోయినా భయపడేది లేదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తీసుకొచ్చి అక్రమ కేసులు పెట్టినా.. అరెస్టులు చేసినా ఎవరూ భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీ నుంచి ప్రతి డివిజన్‌లో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' ప్రారంభిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు.

ప్రజాస్వామ్యపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'తొలిఅడుగులో' నాయకులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనంతపురంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, నియోజకవర్గ టిడిపి పరిశీలకులు లక్ష్మీనారాయణతో కలిసి వినాయక దేవాలయం నుంచి ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి నాయకుల్లా తాను మాటలు మనిషిని కాదని, పని చేసి చూపిస్తున్నానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోందన్నారు. ముఖ్యంగా ముఖ్యంగా తల్లికి వందనం, పింఛన్లు వంటి పథకాల మీద మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాలనీలోని కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణం రఘు, గాజుల ఆదెన్న, తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గౌస్‌మోదీన్, సరిపూటి రమణ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని పసులూరు గ్రామంలో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, టిడిపి నాయకులు పసుపల శ్రీరామరెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 8లక్షల వ్యయంతో ఎస్సీ కాలనీలో నీరు సరఫరా చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ సొలమన్‌రాజు, ఎపిఒ సుజాత, టిడిపి నాయకులు కన్వీనర్ అశోక్, పసలూరు పిట్టు రామకృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి, ఈరప్ప, చాముండేశ్వరి, వెంకట్‌రాముడు, సి.ఆనంద, కుళ్లాయిస్వామి, టి.శివయ్య, రవి, టి.పవన్, హరికృష్ణ, పెద్దప్ప, దండువారిపల్లి ఆదినారాయణ, ఓబుళపతి, బాబా ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మధురాజు, ఫైబర్ చందు, సెల్ పాయింట్ చాంద్‌బాషా, తెల్లాకుల కేశవ, వెంకటేష్, కోటవీధి షేక్షా, బోయ పాండు, సురేష్, యాడికి పొట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కాల్చినందుకు జరిమానా

పుట్లూరు : మండల కేంద్రంలో సొంతింటి ముందు కూర్చొని బీడీలు తాగుతున్న వ్యక్తిపై పోలీసులు శుక్రవారం అపరాధ రుసుం విధించారు. మండలంలోని నాయకునిపల్లి గ్రామానికి చెందిన చాంద్‌బాషా మండల కేంద్రంలో ఇల్లు బాడుగకు తీసుకుని చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో తన దుకాణం వద్ద కూర్చొని బీడీ తాగుతుండగా పోలీసులు వచ్చి రూ.200 అపరాధ రుసుం విధించారు. ఈమేరకు సంబంధిత మొత్తానికి సంబంధించిన బిల్లును చేతితో రాసి ఇచ్చినట్లు బాధితుడు తెలిపారు. తన దుకాణం వద్దకు పోలీసులు వచ్చి రూ.200 ఇస్తావా.. లేక స్టేషన్‌కు వస్తావా.. అంటూ బెదిరించారన్నారు. అయితే తాను రానన్నందుకు అపరాద రుసుం విధించారని వాపోయారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

నార్పల : రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన ఉందో.. నియంతృత్వ పాలన ఉందో అర్థం కావడం లేదని వైసిపి జిల్లా యువజన విభాగం నాయకులు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో వైసిపి యువజన నాయకులు సొహైల్ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో గొడవలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్తలపై టిడిపి నాయకులు దాడి చేయడం బాధాకరమన్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో గొడవలు సృష్టించడం మంచిది కాదన్నారు. ఇకనైనా కూటమి నాయకులు మేల్కొని ప్రజలకు మంచి చేయాలేగానీ, కక్షసాధింపు చర్యలకు దిగొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గవ్వల సాయికృష్ణ, జిల్లా విద్యార్థి విభాగం నాయకులు మహేష్‌నాయక్, హరినాథ్, ప్రవీణ్, రేవంత్, హరి, కేశవ, గౌతమ్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎప్పటికప్పుడు తిరుగుతూ ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'యువగళం' హామీల అమలుకు డిమాండ్

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మహాధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల ముందు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాద యాత్రలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహించారు. అంతకుముందు వేలాది మంది విద్యార్థులతో కలిసి తోపుడుబండ్ల మీద కూరగాయలు అమ్ముతూ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమయాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని చేశారు. అనంతరం డిఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతురాయుడు, ఆంజనేయులు, వెంకట్‌నాయక్, నరసింహయాదవ్, మంజునాథ్, వంశీ, చందు, ఉమా మహేష్, మౌళి, వినోద్, నాని, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

కంది విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జగదీష్ కోరారు. శుక్రవారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ కందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి, టిడిపి సీనియర్ నాయకులు పంపాపతి, కామాటం శ్రీనివాసులు, కెంచక్కగారి ఈశ్వరయ్య, వన్నార్జున, రాంబాబు, మహేష్, దాసరి కొలిమి నాగరాజు, బండారు సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన యువతను తయారు చేద్దాం

ప్రపంచ జనాభా దినోత్సవంలో డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రణాళికాబద్ధమైన కుటుంబం చాలా శ్రేయస్కరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఇబి దేవి సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రస్తుతం యువ జనాభా సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో దంపతులు తప్పనిసరిగా సంతానాన్ని పొందాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన యువత పెరిగి దేశానికి అవసరమయ్యే పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ మహమ్మద్ రఫీ, హెచ్ఇఒ నాగరాజు, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, పిఎంఒ నాగన్న, సునీల్, లక్ష్మీనరసమ్మ, వేణు, వెంకటేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పొగాకు నియంత్రణ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

యాడికి : యాడికి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్, సాయి సుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు, సిహెచ్ఒ జుబేదా, సూపర్‌వైజర్లు రాంప్రసాద్‌గౌడ్, శోభారాణి, హెల్త్ అసిస్టెంట్ మేల్ శరత్, మద్దిలేటి, ల్యాబ్ టెక్నీషియన్ శిరీషా, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్లలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పావని, సిహెచ్ఒ నాగ రంగయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ, సూపర్‌వైజర్ స్వర్ణలత, స్టాఫ్‌నర్సులు ఫార్మాసిస్ట్ మంగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ విజయప్రసాద్, గౌస్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి '2.0'పై శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పురోగతి సూచిక (వెర్షన్ 2.0)పై మండలంలోని వివిధ శాఖల మండల అధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పంచాయతీ పురోగతిపై కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్న వీరాస్వామి, ఆరోగ్యశాఖ సిహెచ్ఒ బాలాజీ, వెలుగు ఎపిఎం తిప్పమ్మ, ఉపాధి హామీ ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్ రామారావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఎఎన్ఎంలు తదితరులు, పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పురోగతి సూచిక (వెర్షన్ 2.0)పై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయని, వెలుగు ఎపిఎం వెంకటరామిరెడ్డి, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఎఎన్ఎంలు, తదితరులు, పాల్గొన్నారు.

విస్తృతంగా రైల్వే ఎన్నికల ప్రచారం

గుత్తి : ఈనెల 15వ తేదీన జరిగే రైల్వే ఇన్స్టిట్యూట్ ఎన్నికల ప్రచారాన్ని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా నిర్వహించారు. టి విరామ సమయంలో నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఏడిఎస్ నారాయణ మాట్లాడుతూ తాము బలపరిచిన నాయబ్ రసూల్ ప్యానల్ తరపున పోటీ చేసిన వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీజిల్ షెడ్ బ్రాంచి కార్యదర్శి రామాంజనేయులురెడ్డి, ఓపెన్ లైన్ కార్యదర్శి శేఖర్ బాబు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకు 30 సైకిళ్లు వితరణ

ప్రజాశక్తి-అనంతపురం



సైకిళ్లను తొక్కుతున్న అతిథులు

యూనియన్ బ్యాంకు సోషియల్ ఫౌండేషన్ ట్రస్టు ముంబాయి సౌజన్యంతో అనంతపురం జెఎన్‌టియుకు 30 సైకిళ్లను వితరణ చేశారు. ఈమేరకు ఆయా సైకిళ్లను వర్శిటీ విసి సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ పతి ఒక్కరూ సైకిల్ తొక్కడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శక్తిని పెంచుతుందన్నారు. బరువు తగ్గించడంలో కూడా చాలా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఇంత మంచి కార్యక్రామనికి శ్రీకారం చుట్టిన యూనియన్ బ్యాంకుకు ప్రత్యేక అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, పిఆర్ భానుమూర్తి, కె.మాధవి, శారద, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.నాగభూషణం, యునియన్ బ్యాంకు రీజినల్ హెడ్ అనంతపురం జితేంద్రకుమార్ మిశ్రా, డిప్యూటి రీజినల్ హెడ్ శ్రీనివాస సరోజ్ ఠాకూర్, చీఫ్ మేనేజర్ శ్రీహరి, యూనియన్ బ్యాంకు మేనేజర్ మధుబాబు, సిబ్బంది వెంకటేష్, మురళి, బిందు, రంజిత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం క్రైం : నగరంలోని తపోవనం పరిధిలో 33 కెవి టవర్ పని కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీ5 ఎఇ మునిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తపోవనం పరిధిలోని జనశక్తి నగర్, ప్రశాంతినగర్, సోమనాథ్‌నగర్, యువజన కాలనీ, రజక్‌నగర్, శాంతినగర్, తపోవనం సర్కిల్ పరిధిలో అంతరాయం ఉంటుందని తెలిపారు.